సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

SK1 one NEWS HD

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 172 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | గురువారం 10-09-2026



2 లో

## ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే

- బండి సంజయ్
- బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు
- రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అన్న బండి సంజయ్
- కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని వ్యాఖ్య
- పోలీసుల కేసులకు భయపడాల్సిన అవసరం లేదన్న సంజయ్

## కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ




- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం - మిగతా 2 లో

# వరుస ఘటనలపై విచారణ జరిపిస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని 3 రోజుల వరుస ఘటనలపై విచారణ జరిపిస్తాం
- అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- కులవివక్ష, అణచివేత చర్యలను ఈ ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరిక
- ఎర్రవల్లి ఫామ్ హౌజ్‌లోనే కుట్ర జరిగిందని ఆరోపణ



**హైదరాబాద్ :** ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదన్న సీఎం రేవంత్ రెడ్డి కులవివక్ష, అణచివేత చర్యలను తమ ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఎర్రవల్లి ఫామ్ హౌజ్‌లోనే కుట్ర జరిగిందని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని, అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నామని, కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతామని స్పష్టం చేశారు. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నామని వెల్లడించారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు - మిగతా 2 లో

# భూముల భద్రతే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- వచ్చే మార్చి నాటికి సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- అంబేద్కర్ కోనసీమ జిల్లా మాచవరంలో 'మీ భూమి-మీహక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- అర్హులైన రైతులు, లబ్ధిదారులకు పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ
- ఇప్పటివరకు 36 లక్షల మందికి పాస్ పుస్తకాలు అందజేత
- 'మీ భూమి-మీహక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు





**అమరావతి :** 'మీ భూమి-మీహక్కు' కార్యక్రమాన్ని ప్రభుత్వం రైతుల పట్ల బాధ్యతగా భావిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరిట రైతులు, ప్రజల జీవితాలను తలకిందులు చేసిందని సీఎం దుయ్యబట్టారు. ఆ తప్పులన్నింటినీ సరిచేసి ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా పాసుపుస్తకాలు రూపొందించి అందజేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మాచవరంలో గ్రామసభకు సీఎం హాజరయ్యారు. మీ భూమి- మీ హక్కు కార్యక్రమం కింద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. అనంతరం సీఎం మాట్లాడారు. "గతంలో రెవెన్యూశాఖలో డబ్బులు ఇవ్వకపోతే పని జరగదు అనే అపవాదు ఉంది. ఆ అపవాదును మార్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అన్ని సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. గత ప్రభుత్వంలో నేరాలు - మిగతా 2 లో

# జగన్ పాదయాత్ర 2.0 కు ముహూర్తం ఖరారు

- మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమైన వైఎస్ జగన్
- 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాత్ర ప్రారంభం
- బాపట్ల జిల్లా పర్చూరు కార్యకర్తల సమావేశంలో ప్రకటన
- 2029 ఎన్నికలే లక్ష్యంగా రెండో విడత యాత్రకు వ్యూహరచన
- 'ప్రజా సంకల్ప యాత్ర' సెంటిమెంట్‌నే మళ్లీ ఫాలో అవుతున్న జగన్



**అమరావతి :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. నేడు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో 'ప్రజా సంకల్ప యాత్ర' పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న - మిగతా 2 లో



- ఈ సారి ఆ మూడింటిపైనే మెయిన్ ఫోకస్!
- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్
- ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు

## భారత్, రష్యా రక్షణ ఒప్పందం

**ఢిల్లీ :** భారత్- రష్యా మధ్య ఉన్న వ్యూహాత్మక రక్షణ బంధం మరో సరికొత్త మలుపు తిరగబోతోంది. దిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఈ నెల 11న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అత్యంత కీలకమైన ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈసారి అజెండాలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవే ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ, అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్. - మిగతా 2 లో

## యువకుడి కడుపులో గర్భాశయం!

- ఢిల్లీలో 26 ఏళ్ల యువకుడిలో మహిళ అవయవాలు
- సంతానలేమి సమస్యతో ఆసుపత్రికి వెళ్లిన యువకుడు
- స్కానింగ్‌లో గర్భాశయం, ఫెలోపి-యన్ ట్యూబ్స్ ఉన్నట్టు గుర్తింపు
- ఇది ప్రపంచంలోనే అరుదైన వైద్య పరిస్థితి అని వెల్లడి
- శస్త్రచికిత్స చేసి గర్భాశయాన్ని తొలగించిన వైద్యులు - మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాలకు కొత్త రైల్వే లైన్లకు కేంద్రం ఆమోదం




- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్‌కు గ్రీన్ సిగ్నల్
- అరక్కోణం-రేణిగుంట మధ్య 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం
- మూడు ప్రాజెక్టుల కోసం రూ. 10,021 కోట్లు కేటాయింపు
- ఏపీ, తెలంగాణలో రైల్వే సామర్థ్యం పెంచడమే లక్ష్యం

**ఢిల్లీ :** రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని - మిగతా 2 లో

## నిరుద్యోగం, పేదరికం విలయంలో పాకిస్థాన్

- 2026 ఆర్థిక సంవత్సరంలో పాకిస్థాన్‌లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం
- గతేదాది 21.9శాతం ఉన్న పేదరికం ఈసారి 28.9 శాతానికి పెరుగుదల
- నిరుద్యోగుల సంఖ్య 45 లక్షల నుంచి 59 లక్షలకు చేరినట్టు వెల్లడి
- సంక్షేమ పథకాలకు భారీ కేటాయింపులు చేసినా ఫలితం శూన్యం
- బలూచిస్థాన్‌లో 47 శాతంతో అత్యధిక పేదరికం నమోదు



**ఢిల్లీ :** పొరుగు దేశం పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ప్రభుత్వం సంక్షేమ పథకాలపై భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ, 2026 ఆర్థిక సంవత్సరంలో పేదరికం, నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరిగాయని ఒక నివేదిక వెల్లడించింది. - మిగతా 2 లో

# సంపాదకీయం

## అది యుద్ధం కాదట!

ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్నది యుద్ధం కాదట. కనుక, అది ఎప్పుడు ముగుస్తుందో, ఎలా ముగుస్తుందో చెప్పలేమన్నది అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్య సారాంశం. ఏడు నెలలుగా యుద్ధం సాగుతూ, నవంబరులో ఎన్నికలొస్తున్న తరుణంలో జనానికి ఏం చెప్పుకోవాలో తెలియక ట్రంప్ ప్రభుత్వం ఇలా కొత్త నిర్వచనాలు సృష్టిస్తున్నట్టుంది. ఓ నెలపాటు కాస్తోకూస్తో ప్రశాంతత కొనసాగిన తరువాత అమెరికా మళ్ళీ ఇటీవల ప్రళయభీకరంగా ఇరాన్ మీద విరుచుకుపడిన నేపథ్యంలో గురువారం జేడీ వాన్స్ ఈ వ్యాఖ్య చేశారు. ఇరాన్‌తో చర్చలు నిలిచిపోవడం, తిరిగి రాజుకున్న యుద్ధంతో అమెరికాలో డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం ట్రంప్ రేటింగ్‌లను కుప్పకూలుస్తూ, మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేస్తున్నాయి.మూడు రోజులనాటి అమెరికా దాడులు వాన్స్ పరిభాషలో యుద్ధం కాకపోవచ్చు గానీ, కాస్తంత అదుపులో ఉన్న చమురు ధరలు ఈ దెబ్బతో తిరిగి భగ్గుమన్నాయి. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్‌లో ఒక పెళ్ళి బృందం మీద అమెరికా విమానాలు జరిపిన దాడిలో అరడజను మంది మరణించారు, ఎనభై మంది తీవ్రంగా గాయపడ్డారు. అప్రదిష్టపాలైన అమెరికా ఈ దాడిమీద దర్యాప్తు జరుపుతుందట. ఈ దారుణఘటన సహా అమెరికా రెండురోజులపాటు 60పైగా స్థావరాలపై జరిపిన దాడులకు ప్రతీకారంగా గల్ఫ్‌లోని దాని మిత్రదేశాలపై ఇరాన్ కూడా విరుచుకుపడింది. శత్రువును ఎంతగా దెబ్బతీశామో ఉభయపక్షాలూ ఎంతో గొప్పగా లెక్కలు విప్పుకున్నాయి కానీ, పశ్చిమాసియా మళ్ళీ ఉద్రిక్తంగా తయారైంది. 'హోర్ముజ్' పూర్తిగా తన నియంత్రణలోనే ఉందనీ, దాని పేరు 'ట్రంప్ జలసంధి'గా మార్చేయాలని అమెరికా అధ్యక్షుడు గొప్పకు పోతున్నారు. హోర్ముజ్‌లో సముద్రంలోని మందుపాతరలను తాకి చమురు ట్యాంకర్లు పేలిపోతున్న వార్తలు కూడా మరోపక్క వింటున్నాం. అమెరికా దాడులు కచ్చితంగా ఒక భయానకమైన, పూర్తిస్థాయి యుద్ధానికి మార్గం సుగమం చేస్తున్నాయి. హోర్ముజ్‌మీద పట్టు, చమురు ధరల నియంత్రణతో గ్లోబల్ మార్కెట్లలో విశ్వాసాన్ని నెలకొల్పడంతోపాటు, అమెరికా ఓటరు మనసు గెలుచుకోవాలని ట్రంప్ ఆశపడుతున్నారు. దీనికి బదులుగా హోర్ముజ్ చేజారలేదని నిరూపిస్తూ మిగతా ప్రపంచంలో అభద్రత, అనుమానాలు కొనసాగేట్టు చేయడం ఇరాన్ లక్ష్యం. ఇరాన్ తన అణ్వాయుధాలను వదిలేసి, యురేనియం శుద్ధిని నిలిపేసి, పశ్చిమాసియాలోని తన ప్రాక్సీలకు ఆయుధాలు అందించడం ఆపేసి, పూర్తిగా చేతులు ఎత్తేసేంతవరకూ యుద్ధం సాగుతూనే ఉంటుందని అమెరికా విదేశాంగమంత్రి చెబుతున్నారు. అణ్వాయుధాలూ లేవు, నిల్వలూ లేవు, మీకు ఓపికున్నంత కాలం చేతనైనది చేసుకోమని ఇరాన్ సవాల్ చేస్తోంది.సముద్రంలో తొమ్మిది నెలలపాటు ఉండిపోయి, తుప్పుపట్టి, తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్న ఐదువేలమంది సైనికులతో అమెరికా యుద్ధనౌక అబ్రహాం లింకన్ మొన్ననే థాయ్‌లాండ్ తీరం చేరింది. అమెరికన్ సైనికులు సేదతీరడానికి వస్తుండటంతో పటాయాలో వ్యభిచార నియంత్రణ చర్యలు చేపట్టినట్టుగా వార్తలు వెలువడ్డాయి. తాజాగా, పశ్చిమాసియాలో దళాల మోహరింపు వచ్చే ఏడాదివరకూ పొడిగిస్తూ అమెరికా రక్షణమంత్రి ఆదేశాలు జారీ చేసినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. యుద్ధం ఆరంభించిన అమెరికా అధ్యక్షుడికి దానిని ఇప్పట్లో ముగించే ఉద్దేశం లేదని అర్థమవుతూనే ఉంది. యాభైవేల మంది అమెరికన్ సైనికులు, పాతిక యుద్ధనౌకలు, డజన్లకొద్దీ యుద్ధవిమానాల మోహరింపుతో ట్రంప్ ఇప్పటివరకూ సాధించిందేమిటో తెలియదు. ఫిబ్రవరిలో ఆరంభమైన 'ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీ' ట్రంప్ పరిభాషలో చెప్పాలంటే, ఒక స్వల్పకాలిక సైనిక చర్యగా కాక, ఇరాన్ తీవ్రప్రతిఘటనతో యుద్ధంగా మారి ఏడు నెలలుగా సాగుతోంది. అమెరికన్లకూ, మిగతా ప్రపంచానికీ తీవ్రనష్టాన్ని చేకూర్చిన అమెరికా అధ్యక్షుడు వచ్చే ఏడాది కూడా యుద్ధాన్ని కొనసాగించే ఆలోచనతో ఉన్నారన్నది వాన్స్ వ్యాఖ్యల్లోని పరమార్థం.

## జగన్ పాదయాత్ర 2.0 కు ముహూర్తం ఖరారు

**మొదటిపేజీ తరువాయి -** శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యాత్ర ముగిసింది.ఈ యాత్రలో భాగంగానే ఆయన 'నవరత్నాలు' పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి.మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు.త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, రూట్‌మ్యాప్‌పై స్పష్టత రానుంది. మొత్తం మీద 2029 ఎన్నికల సమరానికి జగన్ ఇప్పటినుంచే 'పాదయాత్ర 2.0'తో సిద్ధమవుతున్న సంకేతాలు పంపారు.


## తెలుగు రాష్ట్రాలకు కొత్త రైల్వే లైన్లకు కేంద్రం ఆమోదం

**మొదటిపేజీ తరువాయి -** వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు.కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్–కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం–రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029–30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది.

## విడ్డూరం.. యువకుడి కడుపులో గర్భాశయం!

**మొదటిపేజీ తరువాయి -** ఢిల్లీలో ఒక అత్యంత అరుదైన వైద్య వింత వెలుగులోకి వచ్చింది. సంతానలేమి సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన 26 ఏళ్ల యువకుడి శరీరంలో గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్ ఉండటాన్ని గుర్తించిన వైద్యులు విస్మయానికి గురయ్యారు. సాధారణ పరీక్షల క్రమంలోనే ఈ వింత విషయం బయటపడింది.ఢిల్లీకి చెందిన సదరు యువకుడు సంతాన సంబంధిత సమస్యలతో వైద్యులను సంప్రదించగా, అతనికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తరుణంలో పొత్తికడుపులో మహిళలకు ఉండే గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్ ఉన్నట్లు తేలింది. వైద్య పరిభాషలో ఈ అరుదైన పరిస్థితిని 'పర్సిస్టెంట్ ముల్లేరియన్ డక్ట్ సిండ్రోమ్' అని పిలుస్తారని వైద్యులు వెల్లడించారు. జన్యుపరంగా పురుషుడైనప్పటికీ, వారి శరీరంలో స్త్రీ పునరుత్పత్తి అవయవాలు కూడా అభివృద్ధి చెందడం ఈ సిండ్రోమ్ యొక్క ప్రధాన లక్షణం.ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు ఇలాంటి కేసులు 300 కంటే తక్కువగానే నమోదయ్యాయని వైద్య నిపుణులు వివరించారు. ఇది అత్యంత అరుదైన స్థితి కావడంతో దీనిని గుర్తించడం కూడా కష్టతరమని వారు పేర్కొన్నారు. అనంతరం వైద్యులు ఆ యువకుడికి శస్త్రచికిత్స నిర్వహించి, గర్భాశయ సంబంధిత భాగాలను విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం ఆ యువకుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

## ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు.దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# భూముల భద్రతే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -**

ఘోరాలు చేశారు. భూములకు భద్రత ఇవ్వడమే కూటమి ప్రభుత్వం అజెండా. పటిష్టంగా రీసర్వే చేసి అత్యుత్తమ టెక్నాలజీతో పాస్ పుస్తకాలు ఇస్తున్నాం.కూటమి ప్రభుత్వం ఇచ్చే పట్టాదారు పాస్‌పుస్తకాలు ఎవరూ మార్చలేరు. ఇప్పటివరకు 36 లక్షల మందికి పాస్ బుక్‌లు ఇచ్చాం, వచ్చే మార్చిలోపు 56 లక్షల మందికి అందజేస్తాం. పాలన అంటే సచివాలయంలో ఉండటం కాదు. ప్రజల వద్దకు వచ్చి కష్టసుఖాలు తెలుసుకొని పాలసీలు తెచ్చి న్యాయం చేయాలి. ఓటు వేసి గెలిపించిన ప్రజలతో మాట్లాడేందుకే నా పర్యటనలు. పేదల సేవలో పునీతమయ్యేందుకు సూపర్ సిక్స్ సహా సంక్షేమ పథకాలు. ప్రజలంతా గౌరవప్రదంగా జీవించే వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది. పీ4 పథకం తెచ్చి పేదలను ఆదుకునే కార్యక్రమం చేపట్టాం. పిల్లలే సంపద పిల్లలు లేకపోతే యంత్రాలకు సేవ చేయాల్సి వస్తుంది" అని సీఎం చంద్రబాబు అన్నారు."విలువలతో కూడిన రాజకీయం చేయాలనే ఆలోచనతో ఫ్యామిలీ బిజినెస్ ఏర్పాటు చేశా. మూడేళ్ల క్రితం ఇదే రోజు నంద్యాలలో మీటింగ్ నుంచి వస్తుంటే అరెస్ట్ చేశారు. ఏ కేసులో అరెస్టు చేస్తున్నారని అడిగితే చెప్పలేదు. 53 రోజులు రాజమహేంద్రవరం జైలులో ఉన్నా ను. జీవితంలో ఏది జరగకూడదని అనుకున్నానో అదే జరిగింది. నేను జైలులో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ వస్తే ఇబ్బంది పెట్టారు. ఇబ్బందులను ఎదుర్కొని నన్ను కలిశారు. కోనసీమ అంటే బాలయోగి గుర్తుకు వస్తారు. ప్రజల జీవితాలు బాగుపడాలనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. నాలుగో శనివారం వస్తే పేదల ఆరోగ్యం గుర్తుకు వస్తుంది. గత ప్రభుత్వం ప్రజల జీవన విధానాన్ని అస్తవ్యస్థం చేసింది" అని సీఎం అన్నారు. "రాష్ట్రంలో గొడ్డలి పార్టీ రప్పా రప్పా అంటూ అరాచకాలు చేస్తోంది. ఇలాంటి వారికి నేను ఎప్పుడూ భయపడను. నేను తీవ్రవాదులతో సైతం పోరాడాను. అలిపిరి వద్ద క్లైమోర్ మైన్లతో నాపై దాడి చేశారు. నాకు వెంకటేశ్వర స్వామి పునర్జన్మ ఇచ్చారు. రాయలసీమలో ఫ్యాక్షన్‌ను తొలగిం చేందుకు మా ఎమ్మెల్యేలనే అరెస్టు చేశా. నేను సమర్థంగా, లేకపోతే నాకే కాదు రాష్ట్రానికే నష్టం. మా హయాంలో డీఎస్సీని పారద ర్శకంగా నిర్వహించి ఉద్యోగాలిచ్చాం. రెవెన్యూ పరంగా ఏ వ్యక్తి నష్టపోకూడదనే కష్టపడుతున్నాను. 20మంది ఎంపీలను గెలిపించారు, కాబట్టే కేంద్రం నుంచి నిధులు తేగలుగుతున్నాం. పది పదిహేనుళ్లు కష్టపడి పనిచేస్తే దేశంలో ఏపీ నెంబర్ 1 అవుతుంది. వచ్చే ఎండాకాలంలోపు కోనసీమలో త్రీఫేజ్ కరెంట్ ఇస్తాం. మహిళలకు వంట గ్యాస్ డబ్బులను 4 నెలలకొకసారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం అని సీఎం అన్నారు.

## నిరుద్యోగం, పేదరికం విలయంలో పాకిస్థాన్


**మొదటిపేజీ తరువాయి -** కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి విపరీతంగా పెరిగిపోయిందని, ప్రజల జీవనం దుర్భరంగా మారిందని ఆ నివేదిక స్పష్టం చేసింది.పాకిస్థాన్ ఎకనామిక్ సర్వే 2025–26ను ఉటంకిస్తూ 'ది ఫ్రైడే టైమ్స్' ప్రచురించిన కథనం ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరంలో 21.9 శాతంగా ఉన్న జాతీయ పేదరికం రేటు, ఈ ఏడాది 28.9 శాతానికి భారీగా పెరిగింది. దేశంలోని అన్ని ప్రధాన రాష్ట్రాల్లోనూ పరిస్థితి మరింత దిగజారినట్టు గణాంకాలు చెబుతున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో పేదరికం 16.5శాతం నుంచి 23.3శాతానికి పెరిగింది. సింధ్‌లో 24.5శాతం నుంచి 32.6శాతానికి, ఖైబర్ పఖ్తుంఖ్వాలో 28.7శాతం నుంచి 35.3శాతానికి ఎగబాకింది. దేశంలోనే అత్యంత పేద ప్రావిన్స్‌గా ఉన్న బలూచిస్థాన్‌లో పేదరికం 41.8శాతం నుంచి 47 శాతానికి చేరింది.పేదరికంతో పాటు నిరుద్యోగం కూడా తీవ్రస్థాయికి చేరింది. గత ఏడాది 45 లక్షలుగా ఉన్న నిరుద్యోగుల సంఖ్య, ఈ ఏడాది 59 లక్షలకు పెరిగింది. నిరుద్యోగిత రేటు 6.3శాతం నుంచి 7.1శాతానికి పెరిగినట్టు నివేదిక పేర్కొంది. ఉపాధి అవకాశాలు కల్పించడంలో, ప్రజల ఆదాయాలు పెంచడంలో ప్రభుత్వం విఫలమవుతోందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం.ప్రభుత్వం తన ప్రధాన సామాజిక భద్రతా పథకమైన 'బెనజీర్ ఇన్‌కం సపోర్ట్ ప్రోగ్రామ్' (బీఐఎస్‌పీ) కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో 722.9 బిలియన్ల పాకిస్థానీ రూపాయలు (రూ.24,773కోట్లు) కేటాయించింది. ఇందులో ఇప్పటికే 540.27 బిలియన్ల పాకిస్థానీ రూపాయలు (రూ.18,466కోట్లు) విడుదల చేసింది. ఈ పథకం కింద పేద కుటుంబాలకు నగదు బదిలీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మెరుగుపడటం లేదు.కేవలం నగదు బదిలీ పథకాలతో పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యం కాదని నివేదిక స్పష్టం చేసింది. ఉద్యోగాల కల్పన, విద్య–నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, గ్రామీణ పారిశ్రామికీకరణ, చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహం వంటి చర్యలు తీసుకుంటేనే దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని సూచించింది. కార్మిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడం ద్వారా సంక్షేమ పథకాలపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

## కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ




**మొదటిపేజీ తరువాయి -** రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# భారత్, రష్యా రక్షణ ఒప్పందం



**మొదటిపేజీ తరువాయి -** ఈ రక్షణ ఒప్పందాలు కార్యరూపం దాల్చితే ఆసియా ఖండంలో భారత్ రక్షణ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.మిలిటరీ–టెక్నికల్ సహకారమే ప్రధాన అజెండాగా ఈ చర్చలు సాగనున్నాయని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చేసిన తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో మొదటి ప్రధాన అంశం. ఎస్–400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ. శత్రు దేశాల నుంచి దూసుకొచ్చే విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిస్సైళ్లను గాలిలోనే పసిగట్టి నిర్వీర్యం చేయగల శక్తివంతమైన వ్యవస్థ ఇది. 2018లో రష్యాతో భారత్ 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు వ్యవస్థలను కొనుగోలు చేయగా, ఇప్పటికే మూడు భారత్‌కు చేరాయి. భారత వాయు రక్షణలో కీలకమైన ఈ ఎస్–400 సిస్టమ్స్ తదుపరి రెండు యూనిట్లను 2026 నాటికి పూర్తి స్థాయిలో సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నామని రష్యా తాజాగా ప్రకటించింది. రక్షణ కొనుగోళ్ల మండలి కూడా అదనపు వ్యవస్థల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఈ డెలివరీలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.ఇక ఈ భేటీలో అత్యంత వ్యూహాత్మకమైన, ఆసక్తికరమైన అంశం, రష్యాకు చెందిన ఐదో తరం 'సుఖోయ్–57' (ఎస్‌యు–57) స్టెల్త్ ఫైటర్ జెట్. శత్రు రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించగల ఈ అధునాతన యుద్ధ విమానాన్ని భారత్‌కు విక్రయించేందుకు రష్యా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, భారత్ వ్యూహం ఇక్కడ భిన్నంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా కేవలం కొనుగోలు దారుడిగా మిగిలిపోకుండా, టెక్నాలజీ బదిలీ జరగాలని భారత్ పట్టుబడుతోంది. ఆధునిక రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, సెన్సార్ ఇంటిగ్రేషన్ ఇంజిన్ తయారీ వంటి అత్యంత సున్నితమైన సాంకేతికతను పంచుకోవడంపై ఇరు దేశాల శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, దేశీయ ఉత్పత్తి రంగంలో భారత్ ఒక భారీ ముందడుగు వేసినట్లే.ఈ అజెండాలో ముచ్చటగా మూడో కీలక అంశం, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అప్‌గ్రేడ్. భారత్, రష్యాల ఉమ్మడి రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి ఈ క్షిపణి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. ఇప్పటికే భూ, జల, వాయు మార్గాల నుంచి ప్రయోగించేలా బ్రహ్మోస్ సక్సెస్ అయింది. ఇప్పుడు దీని రేంజ్, ఫీచర్లను పెంచి మరింత ఆధునీకరించాలని రష్యా కోరుతోంది. ఇలా చేయడం ద్వారా అంతర్జాతీయ డిఫెన్స్ మార్కెట్‌లో బ్రహ్మోస్‌ను ప్రధాన ఆకర్షణగా మార్చాలనేది ఇరు దేశాల ప్లాన్. ఇప్పటికే పలు దేశాలకు బ్రహ్మోస్ ఎగుమతులు ప్రారంభమైన నేపథ్యంలో, ఈ కొత్త అప్‌గ్రేడ్ భారత్‌ను గ్లోబల్ డిఫెన్స్ ఎగుమతిదారుగా ఒక మెట్టు పైకి ఎక్కిస్తుంది.దశాబ్దాలుగా రష్యా అంటే భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాల నుంచి కూడా భారత్ భారీగా రక్షణ ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో రష్యా తన పాత పద్ధతులను మార్చుకుంటోంది. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం, పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ భారత్ లాంటి నమ్మకమైన భాగస్వామిని మరింత చేరువ చేసుకునేందుకు, ఏకంగా సాంకేతికతనే పంచుకోవడానికి రష్యా సిద్ధపడటం విశేషం. పాత ఆయుధాల స్థానంలో జాయింట్ ప్రొడక్షన్, కొత్త టెక్నాలజీ, దేశీయ తయారీ ఇవే భవిష్యత్ భారత్–రష్యా రక్షణ బంధానికి పునాది కానున్నాయి. అందుకే ఈ సెప్టెంబర్ 11న జరిగే సమావేశం, భారత భద్రతా ముఖచిత్రాన్ని మార్చే కీలక ఘట్టంగా మారబోతోంది.

# వరుస ఘటనలపై విచారణ జరిపిస్తాం



**మొదటిపేజీ తరువాయి -** తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా? నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు."అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమా పణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని, వారికి కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశిం చారని వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సంధ్యారావు పోస్టు చేశారని, పదేళ్లు సీఎంగా ఉండి విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా? ప్రశ్నించారు.శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని, తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలని హితవు పలికారు. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని, దళితులను అవమానించిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా కూడా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కాదని, కులవివక్ష, అణచివేత చర్యలను ప్రజా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.

## తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు

**శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు**

**సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు**

**ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ**

**తిరుమల అన్నమయ్య భవనంలో విడుదల చేసిన చైర్మన్ బీఆర్ నాయుడు**

**ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటన**



కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఖరారు చేసింది. 2026 సంవత్సరానికి గాను సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఇప్పటి నుంచే ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది.ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబరు 15న సీఎం చంద్రబాబు స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.ఈ ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పాలకమండలి సభ్యులు బుధవారం తిరుమలలో ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం సందర్భంగా ఈ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో జరిగే వాహన సేవలు, ఇతర ముఖ్య కార్యక్రమాల వివరాలను భక్తులకు సులభంగా తెలియజేసేందుకు దీనిని రూపొందించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోందని స్పష్టం చేశారు. ఉత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కూడా బ్రహ్మోత్సవాల వివరాలను పంచుకున్నారు. టీటీడీ ప్రకటనతో శ్రీవారి భక్తుల్లో బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది.

కర్నూలు సీమకిరణం నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పుకార్లకు దూరంగా ఉండండి...

పోలీసులకు సహకరించండి

వినాయక ఉత్సవాలు సామరస్యానికి ప్రతీకగా నిలవాలి

ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం : కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్









**కర్నూలు క్రైమ్ /ఆదోని, సెప్టెంబర్ 09 (సీమకిరణం న్యూస్):** వినాయక చవితి వేడుకలను అందరూ కలిసి మెలిసి ఆనందంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పిలుపునిచ్చారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బుధవారం ఆదోని పురపాలక సంఘం కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపార వర్గాలు, వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అన్ని మతాల మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పండుగలను సంతోషంగా ప్రారంభించి, ప్రశాంతంగా ముగించుకోవాలని సూచించారు. పోలీసు శాఖ ప్రజలపై అనవసరమైన ఆంక్షలు విధించదని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు, ఉత్సవ కమిటీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కోరారు.

### ఎస్పీ సూచనలు...

వినాయక నిమజ్జన ఊరేగింపులను సకాలంలో పూర్తి చేయాలి.

రాత్రివేళ నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక అప్రమత్తత పాటించాలి.

వినాయక మండపాల వద్ద 24 గంటలూ కమిటీ సభ్యులు లేదా వాలంటీర్లు అందుబాటులో ఉండాలి.

అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.

మండపాల వద్ద తాత్కాలిక సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

డీజేలు, అధిక శబ్దాలకు దూరంగా ఉండి ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, అసత్య సమాచారాన్ని నమ్మరాదు.

ఎలాంటి సమాచారమైనా ధ్రువీకరించకుండా ఇతరులకు ఫార్వర్డ్ చేయరాదు.

చిన్న సంఘటనలు పెద్ద సమస్యలుగా మారకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని చిన్న మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు. అనంతరం చిన్న హరివాణం సమీపంలోని కేసీ కెనాల్ కాలువ వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఘాట్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆదోని మున్సిపల్ కమిషనర్ నయూమ్ అహమ్మద్, తహసీల్దార్ వేణుగోపాల్, ఆదోని డీఎస్పీ వెంకటరమణ, స్పెషల్ బ్రాంచ్ సీఐలు మధుసూదన్ రావు, కేశవరెడ్డి, ఆదోని పట్టణ సీఐలు రాజశేఖర్ రెడ్డి, నల్లప్ప, రామలింగయ్య, చంద్రశేఖర్, ఇస్వి ఎస్సై మహేష్ కుమార్, వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు, అన్ని మతాల మత పెద్దలు పాల్గొన్నారు.

# కక్ష సాధింపుపై గెలిచిన నిజం..!

మండల కన్వీనర్ టి. బలరాం గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ బొమ్మన రమాకాంత్‌రెడ్డి

నిజం గెలిచింది..! వెల్దుర్తిలో టీడీపీ శ్రేణుల కొవ్వొత్తుల ప్రదర్శన

వెల్దుర్తిలో వెలిగిన విజయ జ్యోతులు

చంద్రబాబు అరెస్టు నాటి పరిణామాలను గుర్తుచేసుకున్న నాయకులు, కార్యకర్తలు





**వెల్దుర్తి, సెప్టెంబర్ 09, (సీమకిరణం న్యూస్):** మూడేళ్ల క్రితం టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అప్పటి ప్రభుత్వం అరెస్టు చేసి జైలుకు తరలించిన నాటి పరిణామాలను గుర్తు చేసుకుంటూ వెల్దుర్తి పట్టణంలో టీడీపీ శ్రేణులు బుధవారం రాత్రి 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించాయి. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శివశంకర్‌రెడ్డి టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ టి. బలరాం గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ బొమ్మన రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి చంద్రబాబుకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుపై రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసులు బనాయించి నిర్బంధించారని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు. 'నిజం గెలవాలి' అంటూ ప్రజలు పెద్దఎత్తున చంద్రబాబుకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. చంద్రబాబు 53 రోజులపాటు నిర్బంధంలో ఉన్న సమయంలో తెలుగుజాతి మొత్తం ఆయనకు అండగా నిలిచిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విదేశాల్లోని తెలుగువారు సైతం చంద్రబాబుకు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. కష్టకాలంలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు చూపిన అండ మరువలేనిదని అన్నారు.

### 'నిజం గెలవాలి' నుంచి 'నిజం గెలిచింది' వరకు...

చంద్రబాబు జైలు నుంచి విడుదలైన అనంతరం నాటి 'నిజం గెలవాలి' నినాదం నేడు 'నిజం గెలిచింది'గా మారిందని నాయకులు పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ చంద్రబాబుపై నమోదైన కేసుల్లో కోర్టుల తీర్పులు తమ వాదనలకు బలం చేకూర్చాయని అన్నారు. నాటి చీకటి రోజులను గుర్తుచేసుకోవడంతో పాటు చంద్రబాబుకు మద్దతుగా నిలిచిన ప్రతి తెలుగువారికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావలకోట రామకృష్ణ ఆచారి, పులగుమ్మి వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్ గౌడ్, శేఖర్‌రెడ్డి, సూరి సతీష్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కొవ్వొత్తులు వెలిగించారు.

# కర్నూలు జిల్లా మత సామరస్యానికి ప్రతీక...

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

రోడ్లకు అడ్డంగా మండపాలు ఏర్పాటు చేయొద్దు.. డీజేల శబ్దం 70 డెసిబుల్స్‌కు మించరాదు

రాత్రి 10 గంటల తర్వాత డీజేలు, మైకులకు అనుమతి లేదు

9వ రోజు నిమజ్జనోత్సవానికి పటిష్ట పోలీసు బందోబస్తు









**కర్నూలు క్రైమ్, సెప్టెంబర్ 09, (సీమకిరణం న్యూస్):** కర్నూలు జిల్లా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని, వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనోత్సవాలను కులమతాలకు అతీతంగా సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పిలుపునిచ్చారు. బుధవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని వ్యాస్ ఆడిటోరియంలో గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వివిధ మతాల పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు, పోలీసు ఉన్నతాధికారులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో తరతరాలుగా అన్ని కులాలు, మతాల ప్రజలు కలిసి జీవిస్తున్నారని తెలిపారు. ప్రజల మధ్య నెలకొన్న సోదరభావం, ఆప్యాయతలు కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. పండుగలు వస్తుంటాయి, పోతుంటాయి కానీ మానవ సంబంధాలు మాత్రం శాశ్వతంగా నిలవాలని అన్నారు. సమాజంలో శాంతిభద్రతలు సక్రమంగా ఉంటేనే ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని, తద్వారా కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు జిల్లాకు తరలివచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు పెరగడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించి జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

### చిన్న పొరపాట్లు పెద్ద సమస్యలకు దారితీయొద్దు...

పండుగల సమయంలో జరిగే చిన్నచిన్న పొరపాట్లు ఒక్కోసారి సమాజంలో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుందని ఎస్పీ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. చట్టాన్ని గౌరవిస్తూ, ఎవరి మనోభావాలకూ భంగం కలగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. స్థానికంగా ఏవైనా చిన్న సమస్యలు తలెత్తితే స్వయంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయకుండా వెంటనే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### సోషల్ మీడియా పుకార్లను నమ్మవద్దు...

వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణ లేని సందేశాలు, రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలను గుడ్డిగా నమ్మవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. వాటిని బాధ్యతారహితంగా ఇతరులకు షేర్ చేయరాదన్నారు. ఏదైనా అనుమానాస్పద సమాచారం కనిపించినా లేదా తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

### డీజేలపై కఠిన ఆంక్షలు...

వినాయక మండపాలను రోడ్లకు అడ్డంగా ఏర్పాటు చేసి ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. చట్టప్రకారం డీజేల శబ్దం 70 డెసిబుల్స్‌కు మించకూడదన్నారు. నిర్ణీత పరిమితికి మించి శబ్దం చేసే డీజే సిస్టమ్‌లపై చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాత్రి 10 గంటల తర్వాత మండపాల వద్ద డీజేలు, మైకులు వినియోగించేందుకు అనుమతి లేదని తెలిపారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు

### ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లపై పరిశీలన...

వర్షాలు లేక వినాయక ఘాట్‌లో తగినంత నీటి లభ్యత లేకపోతే భక్తులకు ఇబ్బంది కలగకుండా నగర శివార్లలోని నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు చేయడంపై ముందస్తుగా పరిశీలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 9వ రోజు నిర్వహించే నిమజ్జన శోభాయాత్రకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ కర్నూలు నగరంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రలు గతంలోనూ సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో కొనసాగాయని తెలిపారు. ఈ ఏడాది కూడా ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఇరు మతాల పెద్దలు స్వచ్ఛందంగా హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కర్నూలు డీఎస్పీ కే.వి. రాఘవేంద్ర, కర్నూలు ఒకటవ పట్టణ సీఐ మారుతి శంకర్, రెండవ పట్టణ సీఐ శ్రీధర్, మూడవ పట్టణ సీఐ శేషయ్య, నాలుగవ పట్టణ సీఐ విక్రమ సింహ, తాలూకా సిఐ తేజ మూర్తి, ప్రభుత్వ ఖాజీ డాక్టర్ అబ్దుస్ సలాం, మౌలానా జాకీర్ అహ్మద్, అబ్దుల్ రజాక్, జహంగీర్, ప్రతాప్ రెడ్డి, వేణుగోపాల్, నాగపని శాస్త్రి, రంగస్వామి, గోరంట్ల రమణ, మహబూబ్ ఖాన్ తదితర వివిధ మతాల పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వినాయక వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

సీఐ వెంకట రామిరెడ్డి

ఎస్సై నాగార్జున





**ప్యాపిలి, సెప్టెంబర్ 9 (సీమ కిరణం):** వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సీఐ వెంకట రామిరెడ్డి,ఎస్సై నాగార్జున మండపాల నిర్వాహకులకు సూచించారు. బుధవారం ప్యాపిలి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.వేడుకల పేరుతో ఎలాంటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి మండపానికి తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. మండపాలను రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేయరాదన్నారు. మండపాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన పాటలు, రెచ్చగొట్టే కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. సౌండ్ సిస్టమ్‌ను అధిక శబ్దంతో వినియోగించకుండా నిబంధనలు పాటించాలన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## విఘ్నేశ్వరుడి కరుణతో ఎల్‌నీనో ప్రభావం తొలగి.. వరుణుడు కరుణించాలి!

గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ఎల్‌నీనో ప్రభావం తగ్గి రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించిన డాక్టర్ శంకర్ శర్మ





**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 09, (సీమకిరణం న్యూస్):** వినాయక చవితి పండుగను హిందువులందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ పిలుపునిచ్చారు. గాయత్రీ ఎస్టేట్‌లోని జై గురుదత్త పాలీ క్లినిక్‌లో పేద హిందూ మహిళలకు ఆయన వినాయక చవితి పండుగ సందర్భంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం అధికమైందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పేద హిందూ కుటుంబాలు కూడా వినాయక చవితి పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో తనవంతు సహాయంగా పండుగ సరుకులను అందజేశానని తెలిపారు. ఈ సందర్భంగా వినాయక చవితి పర్వదిన విశిష్టతను ఆయన వివరించారు. 1893 సంవత్సరంలో స్వాతంత్ర్య సమరయోధుడు బాల గంగాధర్ తిలక్ బహిరంగ ప్రదేశాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి సామూహికంగా పూజలు నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా వినాయక విగ్రహాల నిమజ్జనానికి కూడా నీటి సమస్య ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఎల్‌నీనో ప్రభావం తగ్గి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని డాక్టర్ శంకర్ శర్మ ఆకాంక్షించారు.

## బింగిదొడ్డి మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ నివాళి

శివశంకర్ రెడ్డి భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ

శివశంకర్ రెడ్డి మరణం తీరని లోటు.. పార్టీకి, గ్రామానికి పెద్ద దిక్కు కోల్పోయాం -- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ





**వెల్దుర్తి, సెప్టెంబర్ 09, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్సీపీ నాయకుడు శివశంకర్ రెడ్డి మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. శివశంకర్ రెడ్డి మృతి వార్త తెలుసుకున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ బుధవారం వారి నివాసానికి చేరుకుని భౌతికదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. శివశంకర్ రెడ్డి మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బింగిదొడ్డి జగన్ మోహన్ రెడ్డి, అల్లుగుండు శ్రీరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాల ప్రచురణ

మ్యాప్‌లు, ఓటర్ల జాబితా

పరిశీలించిన


జిల్లా అధికారి సుధాకర్ రెడ్డి



**ప్యాపిలి, సెప్టెంబర్ 9 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల మ్యాప్‌లను అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ నెల 11వ తేదీన ఓటర్ల జాబితాల ప్రచురణకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుధాకర్ రెడ్డి, డోన్ డీడీఓ భాస్కర్ రెడ్డి ప్యాపిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పరిధిలోని ఓటర్ల జాబితాలు, మ్యాప్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, జాబితాల ప్రచురణకు సంబంధించిన ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. మండల స్థాయి సిబ్బంది, ఎంపీడీవో శ్రీనివాసరావు ,డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ పరిపాలన అధికారి తదితరులకు ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

## వినాయక వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఎస్సై అనిల్ కుమార్



**ప్యాపిలి సెప్టెంబర్ 09 (సీమ కిరణం న్యూస్):** వినాయక వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి జలదుర్గం ఎస్సై తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్యాపిలి మండలం జలదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు, గ్రామ పెద్దలతో పోలీసులు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. విగ్రహాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు దూరంగా సురక్షిత ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పండుగ రోజుల్లో కమిటీ సభ్యులు మండపం వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు, భక్తులకు ఇబ్బందులు కలిగించరాదని, మద్యం సేవించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని హెచ్చరించారు. వినాయక చవితి వేడుకలను ఎలాంటి గొడవలు, అల్లర్లు లేకుండా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు.

## మన డబ్బు మన లెక్కలతో పారదర్శకత

సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ హనుమాన్ నాయక్





**వెల్దుర్తి, సెప్టెంబర్ 09, (సీమకిరణం న్యూస్) :** వెల్దుర్తి మండల కేంద్రంలోమన డబ్బులు మన లెక్కలు యాప్ ద్వారా పొదుపు సంఘాలలో పారదర్శకత ఉంటుందని సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ హనుమాన్ నాయక్ తెలిపారు. స్థానిక రాజరాజేశ్వరి దేవాలయంలో గణేష్ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. డిపిఎం అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు తాము చెల్లిస్తున్న రుణాలను ప్రతి ఒక్కరు తెలుసుకొని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఎంఐఎస్ డైరెక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ స్త్రీ నిధి కింద అందిస్తున్న రుణాలతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికంగా రాణించాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధిగా ఏర్పాటు చేసుకున్న బ్యూటీ పార్లర్, బట్టల దుకాణాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎంలు అయ్యన్న, అనురాధ, సీసీలు . ఫాతిమా. శివన్న. నాహోరు. శారద. రామసుబ్బయ్య. ఎఫ్పిఓ పుల్లయ్య . మండల సమాఖ్య ఓబీలు .గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు జగదీశ్వరి, బుక్ కీపర్లు .శ్రీవిద్య, సూర్యచంద్ర.కళావతి. శ్రీలక్ష్మి . పద్మ.లక్ష్మీదేవి. నాగలక్ష్మి. రాధా. కళ్యాణి. మధు.సునీతా.తదితరులు పాల్గొన్నారు.

## నిజం ఎప్పటికైనా గెలుస్తుంది

టీడీపీ నాయకులు

చంద్రబాబు అక్రమ అరెస్టును గుర్తుచేసుకున్న టీడీపీ శ్రేణులు



**ప్యాపిలి, సెప్టెంబర్ 9 (సీమ కిరణం న్యూస్):** నిజం ఎప్పటికైనా గెలుస్తుందనే సందేశంతో ప్యాపిలి మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు. డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్యాపిలి టీడీపీ ఇన్‌చార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో, ప్యాపిలి పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొంగనపల్లి మధు సమక్షంలో నిజం ఎప్పటికైనా గెలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం ఇదే రోజున అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. అనంతరం న్యాయం, నిజం గెలిచాయని పేర్కొంటూ కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. చంద్రబాబుకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ, "నిజం ఆలస్యమైనా విజయం సాధిస్తుంది" అనే నినాదంతో టీడీపీ శ్రేణులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖాజాఫీరా, తోప్పెల శ్రీనివాసులు, గండికోట రామాంజనేయులు, గండికోట రమేష్, ఏనుమ్రి రాంభూపాల్, ప్రిన్సిపల్ మధు, రామ్మోహన్ యాదవ్, పుల్లయ్య, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.



## 100 డాలర్లు దాటిన ముడి చమురు ధరలు..

## భారత్ ఆర్థిక వ్యవస్థపై పశ్చిమాసియా సంక్షోభం..!




పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు వి100 దాటాయి. ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థపై, స్టాక్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇంధన దిగుమతి భారం పెరిగి, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం, రూపాయి పతనం, ఎగుమతుల క్షీణత వంటి సమస్యలతో భారత ఎకానమీ ఒత్తిడికి లోనవుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు 100 డాలర్లను దాటింది. దీంతో స్టాక్ మార్కెట్లతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మళ్లీ చుక్కలను తాకుతున్నాయి. సౌదీ అరేబియా ఇంధన ఉత్పాదక కేంద్రాలపై హౌతీ మిలిటెంట్లు డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయడంతో పశ్చిమాసియాలో టెన్షన్ వాతావరణం మరింత పెరిగింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు రేటు మరోసారి 100 డాలర్లను సమీపించింది. దీంతో మిడిల్ ఈస్ట్‌లో అశాంతి పెరిగితే క్రూడాయిల్ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. దేశ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో రష్యాతోపాటు మిడిల్ ఈస్ట్ దేశాల వాటానే ఎక్కువ. అయితే యుద్ధంతో యూఏఈ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితర గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు ముడి చమురు, గ్యాస్ రాక ఇబ్బందికరంగా మారింది. పెట్రో ఉత్పత్తుల రవాణాకు కీలకమైన హొర్ముజ్ జలసంధిలో నౌకల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నౌకలపై దాడులు జరిగితే బ్యారెల్ విలువ 120 డాలర్లను తాకే అవకాశం ఉంది. అమెరికాకు మద్దతిస్తున్నాయని గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు దిగుతోంది. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్‌లో పెట్రో ధరల పెంపునకు దారితీస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ ఒత్తిడికి లోనవుతోంది. చమురు దిగుమతుల చెల్లింపుల భారం, ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విజృంభణ, రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు, స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు, రూపాయి మారకం విలువ క్షీణత, చమురు ఆధారిత ఉత్పత్తుల తయారీ ఖరీదెక్కడం, ఎగుమతుల పతనం వంటివి దేశ ఎకానమీని రిస్క్‌లో పడేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభం కాగా, అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశంలో లీటర్ పెట్రోల్ రేటు రూ.7.35, డీజిల్ ధర రూ.7.53 పెరిగింది. అమెరికాతో ఇరాన్ చర్చల కారణంగా అప్పట్లో కొంతమేర శాంతియుత పరిస్థితులు మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్నాయి. ఇది మార్కెట్‌లో క్రూడ్ ధరల తగ్గుముఖానికి కలిసొచ్చింది. అయితే మళ్లీ దాడులు మొదలవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్-జూలైలో భారత ముడి చమురు దిగుమతుల విలువ 56 శాతం పెరిగి 63.4 బిలియన్ డాలర్లకు చేరింది. నిరుడు ఇదే సమయంలో 40.5 బిలియన్ డాలర్లేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# డొనాల్డ్ ట్రంప్ విజయం గోల్డ్ మార్కెట్ పతనం!

### గోల్డ్‌కు ట్రంప్ గుబులు
### దేశీయ విపణిలో క్రమేణా క్షీణిస్తున్న ధరలు
### గత 10 రోజుల్లో తులం రూ.5,350 తగ్గుదల

**అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపుతో మార్కెట్ రివర్స్‌గేర్**



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం.. గోల్డ్ మార్కెట్ పతనానికి దారితీస్తున్నది. ఈ నెల 4న ట్రంప్ గెలిచినట్టు అధికారికంగా వెల్లడైన విషయం తెలిసిందే. అయితే అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ విపణిలో 10 గ్రాముల 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) బంగారం ధర రూ.5,350 (6.5 శాతం) పడిపోవడం గమనార్హం. డాలర్ ఇండెక్స్ (డీఎక్స్‌వై) అంతకంతకూ బలపడుతుండటం.. బులియన్ మార్కెట్‌ను బేరిష్ ట్రెండ్‌లోకి నెడుతున్నది. ప్రస్తుతం తులం రూ.77వేల దరిదాపుల్లో ఉన్నది. గత నెలాఖరున మునుపెన్నడూ లేనివిధంగా రూ.82,400 పలికిన సంగతి విదితమే. హైదరాబాద్‌లో తులం 22 క్యారెట్ రేటు రూ.70వేలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివరిదాకా డౌన్‌ట్రెండ్ కొనసాగవచ్చన్న అంచనాలే వినిపిస్తున్నాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక, పాలసీ నిర్ణయాలు వచ్చేదాకా గోల్డ్ రేట్ కరెక్షన్ ఉంటుందంటున్నారు.

**ఎందుకింత ఒత్తిడి?**

గత 10 రోజులుగా బంగారం ధరలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. బహిరంగ మార్కెట్‌తోపాటు కమోడిటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లోనూ ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ట్రంప్ విధానాలను గమనిస్తే.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టారు. అమెరికాకు చైనా నుంచి వచ్చే వస్తూత్పత్తులపై అధిక సుంకాలు విధించడం, వీసా విధానాన్ని కఠినతరం చేయడం వంటివి వీటిలో ఉన్నాయి. మళ్లీ జనవరి నుంచి ఆయనే అధ్యక్షుడిగా రానుండటంతో అమెరికా ఎకానమీపై ముఖ్యంగా ఆ దేశ కరెన్సీ డాలర్‌కు ఎక్కడలేని డిమాండ్‌ను తెచ్చిపెడుతున్నది. దీంతో పెట్టుబడులన్నీ స్టాక్స్, బాండ్ల మార్కెట్ వైపు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా పసిడికి ఆదరణ తగ్గి ధరల క్షీణత చోటుచేసుకుంటున్నది.

**ప్రభావితాంశాలివే..బిట్‌కాయిన్**

బిట్‌కాయిన్‌పట్ల మదుపరులు చూపిస్తున్న అమితాసక్తి కూడా గోల్డ్ మార్కెట్ క్రాష్‌కు దారితీస్తున్నది. ఈ వర్చువల్ కరెన్సీకి అమెరికా మద్దతు ఉండబోతుందన్న అంచనాలే ఇందుకు కారణం. ఈ క్రమంలోనే తరలివస్తున్న పెట్టుబడులతో మళ్లీ ఆల్‌టైమ్ హైల్లో కి బిట్‌కాయిన్ విలువ వెళ్లింది. ప్రస్తుతం విలువ 89వేల డాలర్లపైనే పలుకుతున్నది.

**ఈక్విటీ మార్కెట్లు**

స్టాక్ మార్కెట్లలో నష్టాలను, ఒడిదొడుకులను తట్టుకొనేందుకు ఇన్వెస్టర్లు ఎంచుకొనే సురక్షిత పెట్టుబడి మార్గమే బంగారం. అయితే ప్రస్తుతం మారిన ట్రెండ్‌తో ఇన్నాళ్లూ పెట్టిన పెట్టుబడులను గోల్డ్ మార్కెట్ నుంచి మదుపరులు వెనక్కి తీసుకుంటున్నారు. రిస్క్ ఎక్కువగా ఉన్నా ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధమైపోతున్నారు. ఈటీఎఫ్‌ల నుంచి తరలిపోతున్న నిధులే ఇందుకు నిదర్శనం.

**ఉద్రిక్తతలు తగ్గుతాయని..**

యూరప్‌తోపాటు పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతాయన్న అంచనాలు కూడా పసిడి ధరల్ని కిందకు లాగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైతే రాజకీయ, భౌగోళిక పరిస్థితుల్లో మార్పు ఉంటుందన్న విశ్వాసం మెజారిటీ మదుపరుల్లో కనిపిస్తున్నది.


**డాలర్ ఇండెక్స్...**

ట్రంప్ గెలుపుతో ప్రపంచ కరెన్సీగా పేరున్న అమెరికా డాలర్లకు భారీగా డిమాండ్ వచ్చిపడింది. ఈ క్రమంలోనే డాలర్ ఇండెక్స్ పరుగులు పెడుతున్నది. దేశీయ మార్కెట్ నుంచి గతకొద్ది రోజులుగా తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం అమెరికన్ మార్కెట్లలోకే చేరుతున్నాయి.

**గ్లోబల్ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి ధరలు నేలచూపుల్నే చూస్తున్నాయి. ఔన్సు గోల్డ్ విలువ రికార్డు స్థాయిల నుంచి దిగజారింది. కొమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో 2,557.40 డాలర్లు పలికింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తుండటం కూడా పుత్తడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది.

## మీ హెూమ్ రెనోవేషన్? కోసం లోన్? కావాలా?
## ఇలా చేస్తే చాలు - తక్కువ వడ్డీతో రుణం గ్యారెంటీ



మీ పాత ఇంటిని రినోవేషన్ చేయించాలా? ఇందుకోసం బ్యాంక్? లోన్ కావాలా? ఈ సింపుల్ టిప్స్ మీ కోసమే! చాలా మంది తమ పాత ఇంటిని సరికొత్తగా తీర్చిదిద్దుకోవాలని అనుకుంటారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అది అంత ఈజీ వ్యవహారం కాదు. హెూమ్ రెనోవేషన్?కు చాలా పెద్దమొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం హెూం రినోవేషన్ లోన్‌ను తీసుకుంటే బెటర్. ఈ లోన్‌ను తీసుకునేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇంటి విలువకు రెక్కలు**

కొత్త ఇంటిని నిర్మించడానికి, పాత ఇంటికి రినోవేషన్ చేయించడానికి మధ్య చాలా తేడా ఉంది. కొత్త ఇల్లు కట్టడానికి ఎంత ఖర్చవుతుందో మనం ముందే అంచనా వేయొచ్చు. కానీ పాత ఇంటి పునరుద్ధరణ ఖర్చును ముందే అంచనా వేయలేం. పాత ఇంటి అసలు నిర్మాణం దెబ్బతినకుండా దాన్ని జాగ్రత్తగా పునరుద్ధరించాల్సి ఉంటుంది. రిస్క్ తీసుకొని మనం పాత ఇంటిని పునరుద్ధరిస్తే, కచ్చితంగా దాని మార్కెట్ విలువ పెరుగుతుంది. అందుకే హెూం రినోవేషన్ వల్ల ఆ ఇంటి యజమానులకు లాభమే తప్ప నష్టం కలగదు.

**మరమ్మతు ఖర్చులకు చెల్లు**

ఇంటిని రినోవేషన్ చేయిస్తే యజమానికి ప్రతి సంవత్సరం చాలా మరమ్మతు ఖర్చులు మిగిలిపోతాయి. పాత ఇంటికి పదేపదే మరమ్మతులు చేయించాల్సి వస్తుంటే, తప్పకుండా హెూం రినోవేషన్‌కు మొగ్గుచూపడం బెటర్. రినోవేషన్ చేయించే క్రమంలో ఇంటిలో వాస్తుపరమైన మార్పులు చేసుకోవచ్చు. అదనంగా గదులు నిర్మించుకోవచ్చు. కొత్త అవసరాలకు అనుగుణంగా ఇంట్లో మార్పులు చేయొచ్చు. ఇవన్నీ కలిసి రినోవేషన్ తర్వాత ఇంటి విలువను పెంచుతాయి.

**వడ్డీరేటు, రీపేమెంట్**

ఇంటి రినోవేషన్ లోన్‌ను బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోవచ్చు. సాధారణ హెూం లోన్ వడ్డీ రేట్లే ఈ లోన్‌కు కూడా వర్తిస్తాయి. ఫ్లోటింగ్ వడ్డీరేటు లేదా నిర్దిష్ట కాల స్థిర వడ్డీరేటుల్లో ఏదైనా ఒకదాన్ని మనం ఎంపిక చేసుకోవాలి. ఇంటి ప్రస్తుత మార్కెట్ ధరపై ప్రతిపాదిత సీలింగ్‌కు లోబడి రినోవేషన్ వ్యయ అంచనాలో 100 శాతం దాకా లోన్ చేస్తారు. క్రెడిట్ స్కోరు బాగా ఉన్నవారికి వడ్డీరేటు తక్కువగా ఉంటుంది. మెటీరియల్స్, లేబర్ ఖర్చులు, కాంట్రాక్టర్ ఫీజుల వంటి రినోవేషన్ ఖర్చుల కోసం ఈ ఫండ్స్‌ను వాడాలి. ఈ లోన్ రీపేమెంట్ రూల్స్ సరళతరంగానే ఉంటాయి. హెూం రినోవేషన్ లోన్‌కు వ్యక్తిగతంగా లేదా ఉమ్మడిగా కూడా దరఖాస్తు చేయొచ్చు. లోన్ కాలవ్యవధి 15 సంవత్సరాల వరకు ఉంటుంది. రుణం తీసుకునే సమయంలో మీ వయసు, ఇంటి వయసు, మీ ఆదాయం మొదలైన వాటి ఆధారంగా రుణ కాలవ్యవధిని నిర్ణయిస్తారు.

**ఆర్థిక పరిస్థితిపై అంచనాకు వచ్చాకే**

మీ ఆర్థిక పరిస్థితి, అవసరాలకు సరిపోయేలా ఉండే హెూం రినోవేషన్ లోన్‌ను ఎంచుకోవాలి. ప్రతినెలా ఎంతమేర ఈఎంఐ చెల్లించగలరు? అనే దానిపై మీకు స్పష్టమైన అంచనా ఉండాలి. హెూం రినోవేషన్ కోసం వాడే మెటీరియల్స్, పనివాళ్ల ఖర్చులకు ఎంత డబ్బులు అవసరం అవుతాయనే దానిపైనా ముందస్తు ఎస్టిమేషన్‌ను రూపొందించుకోవాలి. స్థానిక సంస్థల అనుమతులు, అత్యవసర ఖర్చులు వంటి అన్ని ఖర్చులను కలుపుకొని లెక్కలు వేసుకోవాలి. ఇవన్నీ చూసుకున్న తర్వాతే హెూం రినోవేషన్ లోన్ కోసం బ్యాంకుకు వెళితే బెటర్. తొందరపాటులో లోన్ తీసుకొని తర్వాత కట్టలేకపోతే ఇబ్బందుల్లో పడతారు. ఈ లోన్‌కు సంబంధించిన వడ్డీ కాంపోనెంట్‌పై సెక్షన్ 24 కింద సంవత్సరానికి రూ.30 వేల వరకు పన్ను ప్రయోజనం లభిస్తుంది.

**పర్సనల్ లోన్**

ఇంటి రినోవేషన్ కోసం మనం బ్యాంకు నుంచి పర్సనల్ లోన్ తీసుకోవచ్చు. మంచి క్రెడిట్ స్కోరు ఉన్నవారికి ఈ లోన్‌ను పూచీకత్తు లేకుండానే ఇస్తారు. కొన్ని బ్యాంకులు రూ.25 లక్షల దాకా పర్సనల్ లోన్ ఇస్తాయి. హెూం రినోవేషన్ లోన్‌తో పోలిస్తే పర్సనల్ లోన్‌లో వడ్డీ రేటు ఎక్కువ. లోన్ రీపేమెంట్ కాల వ్యవధి ఐదేళ్లలోపు ఉంటుంది. ఎక్కువ విలువగల షేర్లు/మ్యూచువల్ ఫండ్లు కలిగి ఉన్నవారు వాటిపైనా లోన్ తీసుకోవచ్చు.

**టాప్-అప్ లోన్**

ఇప్పటికే హెూం లోన్ ఉన్నవారు ఇంటి రినోవేషన్‌ను చేయదలిస్తే టాప్-అప్ లోన్ కోసం అప్లై చేయొచ్చు. టాప్-అప్ లోన్‌లో భాగంగా మీ ప్రస్తుత హెూం లోన్ అమౌంటుకు మించి అదనపు నిధులను తీసుకోవచ్చు.ఈ ఫండ్స్‌ను హెూం రినోవేషన్ సహా వివిధ పనుల కోసం వాడుకోవచ్చు. లోన్ అగ్రిమెంటుపై సంతకం చేసే ముందు నిబంధనలను పూర్తిగా చదువుకోవాలి. వడ్డీ రేట్లు, రీపేమెంట్ షెడ్యూల్, ముందస్తు చెల్లింపు జరిమానాలు, ఏవైనా అదనపు ఛార్జీల సమాచారాన్ని తెలుసుకోవాలి.

**ఈ డాక్యుమెంట్స్ తప్పనిసరి**

హెూం రినోవేషన్ లోన్‌కు అప్లై చేయాలంటే కొన్ని డాక్యుమెంట్స్ తప్పనిసరి. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం, ఆదాయ రుజువు, ఆస్తి టైటిల్ డీడ్, గత ఆరు నెలల బ్యాంకు స్టేట్‌మెంట్, పునరుద్ధరణ పనికి సంబంధించిన ఇంజనీర్? అంచనాకు సంబంధించిన ప్రాథమిక డాక్యుమెంట్స్ సిద్ధం చేసుకోవాలి. ఇప్పటికే హెూం లోన్ తీసుకున్న వాళ్లకు ఈ డాక్యుమెంటేషన్ ప్రక్రియ చాలా ఈజీగా అయిపోతుంది. కొన్ని బ్యాంకులు పే స్లిప్ కూడా అడగవు. ఇంటి యజమాని ఇచ్చిన అంగీకార లేఖ సరిపోతుంది. స్వయం ఉపాధి పొందేవారు రుణాన్ని తిరిగి చెల్లించగలరని నిరూపించడానికి ఆదాయ రుజువులను చూపించాలి.

## వరుసగా ఐదో రోజు భారీ నష్టాలు సెన్సెక్స్? 984 పాయింట్స్ డౌన్?

23,600కు పడిపోయిన నిఫ్టీ భారీగా నష్టపోయిన ఆటో, బ్యాంకింగ్?, ఫైనాన్సింగ్ స్టాక్స్? దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో రోజు భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు భారీగా తరలివెళ్తుండడమే ఇందుకు కారణం. వీటికి తోడు అక్టోబర్?లో వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6.21 శాతానికి పెరగడం కూడా మదుపరుల సెంటిమెంట్?ను దెబ్బతీసింది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్? 984 పాయింట్లు నష్టపోయి 77,690 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 324 పాయింట్లు కోల్పోయి 23,559 వద్ద ముగిసింది. లాభపడిన షేర్లు : టాటా మోటార్స్?, ఎన్?టీపీసీ, ఏసియన్ పెయింట్స్?, ఇన్ఫోసిస్? నష్టపోయిన షేర్లు : టాటా స్టీల్?, ఎం అండ్ ఎం, అదానీ పోర్ట్స్?, హెచ్?డీఎఫ్?సీ బ్యాంక్?, ఎస్?బీఐ, ఇండస్?ఇండ్? బ్యాంక్, కోటక్ బ్యాంక్?, యాక్సిస్ బ్యాంక్?, రిలయన్స్?, పవర్?గ్రిడ్?, టీసీఎస్

**విదేశీ పెట్టుబడులు**

స్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం, మంగళవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఏకంగా రూ.3,024.31 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను అమ్మేశారు.

**గ్లోబల్ మార్కెట్స్?**

బుధవారం ఏసియన్ మార్కెట్లలో సియోల్?, టోక్యో, హాంకాంగ్ నష్టాలతో ముగియగా, షాంఘై లాభాలతో స్థిరపడింది. ప్రస్తుతం యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. మంగళవారం యూఎస్ మార్కెట్లు నష్టాలతో ముగిసిన విషయం తెలిసిందే.

**రూపాయి విలువ**

అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ ఒక్క పైసా పెరిగింది. ప్రస్తుతం డాలర్?తో పోల్చితే రూపాయి మారకం విలువ రూ.84.38గా ఉంది.

**ముడిచమురు ధరలు**

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు 0.93 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 72.56 డాలర్లుగా ఉంది.



**పెట్రోల్, డీజిల్?? ధరలు**

తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలో పెట్రోల్?, డీజిల్? ధరలు స్థిరంగా ఉన్నాయి. హైదరాబాద్?లో లీటర్ పెట్రోల్? ధర రూ.107.39గా ఉంది. డీజిల్? ధర రూ.95.63గా ఉంది. విశాఖపట్నం?లో లీటర్ పెట్రోల్? ధర రూ.108.27గా ఉంది. డీజిల్? ధర రూ.96.16గా ఉంది. ఢిల్లీలో లీటర్? పెట్రోల్? ధర రూ.94.76గా ఉంటే, డీజిల్? ధర రూ.87.66గా ఉంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com